క్లుప్తంగా

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



గోకవరంలో చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ సందీప్ పాటిల్

గోకవరం: నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్, ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్ సందీప్ పాటిల్ పోలీసు సిబ్బందికి సూచించారు. గోకవరం మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఓటును వినియోగించుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని సూచించారు. ఆయన వెంట స్థానిక ఎస్సై నాగరాజు, ఇతర సిబ్బంది ఉన్నారు.

తొలి రోజు 273 మంది ఓటింగ్



ప్రత్తిపాడు ఫెసిలిటేషన్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ భావన

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తొలిరోజు 273 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో ఉద్యోగులు, ఎన్నికల సిబ్బంది ఓటుహక్కును వినియోగించుకునేందుకు ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌లో పరిధిలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలకు చెందిన 198 మంది పోలింగ్ ఆఫీసర్లు (పీఓ), అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు (ఏపీఓ), 666 మంది అదర్ పోలింగ్ ఆఫీసర్లు (ఓపీఓ), 45 మంది సర్వీసు ఓటర్లు, ఎన్నికల విధులు నిర్వర్తించే 141 మంది పోలీసు సిబ్బంది ఉన్నారు. కాగా శనివారం పీఓ, ఏపీఓ, ఓపీఓలు 273 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

హోం ఓటింగ్‌లో 102 మంది

నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలకు చెందిన అంగవైకల్యం కలిగిన 63 మంది, 85 ఏళ్లు పైబడిన వారు 39 మంది వెరసి 102 మంది హోం ఓటింగ్ ప్రక్రియలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్ భావన పోస్టల్ బ్యాలెట్ ద్వారా జరుగుతున్న ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు.

ప్రభుత్వాసుపత్రికి సీలింగ్ ఫ్యాన్ వితరణ



ఆసుపత్రి డాక్టర్‌కు సీలింగ్ ఫ్యాన్ అందజేస్తున్న విశ్వ హిందూ పరిషత్ సభ్యులు

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వాసుపత్రికి శనివారం దాతలు సీలింగ్ ఫ్యాన్, రోగులకు రొట్టెలు, బిస్కెట్లు వితరణ చేశారు. విశ్వహిందూ పరిషత్ కార్యనిర్వాహక కార్యదర్శి కె.ఇందిర తన తండ్రి, రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి జోగా సుకుమార్‌రాజు జ్ఞాపకార్థం వీటిని వైద్యుడు భావతేజకు అందజేశారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ తదితరులు పాల్గొన్నారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా

ప్రత్తిపాడు రూరల్: మండలంలో గ్రామ వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. పెద్దిపాలెంలో 21 మంది గ్రామ వలంటీర్లు శనివారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ డేవిడ్ రాజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి సేవలందించిన తమను ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో విధులకు దూరం చేయడానికి నిరసనగా రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు.

సీఎం జగన్‌తోనే పథకాల కొనసాగింపు

- మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా
- పి.ఇ.చిన్నాయపాలెంలో ఎన్నికల ప్రచారం



పి.ఇ.చిన్నాయపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి రాజా

తొండంగి: ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజల ఇంటి ముంగిటకే అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. తొండంగి మండలం పి.ఇ.చిన్నాయపాలెంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. పెద రామాలయం వీధి, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం సాగింది. అడుగడుగునా మహిళలు హారతులిస్తూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలతో పాటు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి పలు సంక్షేమ పథకాలను పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల కోసం సీఎం జగన్ ఎంతో పారదర్శకంగా అమలు చేశారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చారన్నారు. విద్య, వైద్య, ఆరోగ్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో చారిత్రాత్మకమైన మార్పు తీసుకొచ్చి అభివృద్ధి చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొయ్యా మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం గంగబాబు, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ధూళిపూడి ఆంజనేయులు, పార్టీ నాయకులు దడాల విజయ్‌కుమార్, అరుమిల్లి ఏసుబాబు, ఎంపీటీసీ గుల్ల మంగ, సర్పంచ్ పసపులేటి పద్మవిజయ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

కోటనందూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని



కేఈ చిన్నయ్యపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న శంకర్‌మల్లిక్

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖమంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని కేఈ చిన్నయ్యపాలెం, భీమవరపుకోట గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ, ఎంపీపీ లగుడు శ్రీనివాసుతో కలిసి ఇంటింటికీ వెళ్లి నవరత్నాలు ప్లస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తుని ఎమ్మెల్యేగా దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. సర్పంచులు జిగటాల వీరబాబు, గుడ్ల సత్తిబాబు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



కోటనందూరులో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్సై శంకర్

కోటనందూరు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శ్రీకరణసాయి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఎస్సై బి.శంకర్ ప్రారంభించారు. ఎస్సై మజ్జిగను స్వయంగా ప్రయాణికులకు పంపిణీ చేశారు. రోజు రోజుకూ ఉష్ణతాపం పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆటో యూనియన్ ప్రతినిధులు తెలిపారు. ఎండల తీవ్రత తగ్గేవరకూ చలివేంద్రాన్ని కొనసాగిస్తామని చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- లింగంపర్తిలో ఎన్నికల ప్రచారం



లింగంపర్తిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని లింగంపర్తిలో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. సర్వేలన్నీ వైఎస్సార్ సీపీకే అనుకూలంగా ఉన్నాయన్నారు. ప్రతికార్యకర్త పార్టీ విజయానికి కష్టపడి పని చేయాలన్నారు. సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అడపా పార్థసారథి, వరుపుల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు ఓటేస్తే ప్రజలకు మేలు

ప్రత్తిపాడు రూరల్: వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు కోడలు ఊర్మిళ దేవి అన్నారు. మండలంలోని రాచపల్లిలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలన్నారు. కాగా వరుపుల సుబ్బారావు మరో కోడలు వీణ శరభవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, గ్రామ సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మీ గంగరాజు, పార్టీ నాయకులు ఒమ్మి వెంకటరమణ, జక్కా త్రిమూర్తులు, గొర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పని ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం

కోటనందూరు: ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ అన్నారు. స్థానిక ఉపాధి హామీ పని ప్రాంతాల్లో శనివారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గర్సింగ్ దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, మల్లంపల్లి ప్రకాష్, దార్ల సూర్యచంద్ర పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు

కోటనందూరు: స్థానిక అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు లక్కాకుల బాబ్జీ శనివారం తెలిపారు. కోటనందూరు, కాకరాపల్లి గ్రామాల్లోని శిక్షణా కేంద్రాల్లో ఇప్పటికే 80 మంది శిక్షణ పొందుతున్నారన్నారు. కోటనందూరుకు చెందిన వెలగా శ్రీనివాసరావు, వెలగా నారాయణరావు ఆర్థిక సహాయంతో కుట్టు మెషీన్లు కొనుగోలు చేసి శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. వేసవి సెలవులు కావడంతో కళాశాల విద్యార్థినులు, ఖాళీగా ఉన్న యువతులు, మహిళలు ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న చలమలశెట్టి సునీల్

- ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, తోట నరసింహం
- వీరవరంలో సగర కులస్తులతో ఆత్మీయ సమావేశం

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. వీరవరంలోని తోట నరసింహం నివాసంలో సగర సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం మహాలక్ష్మి అధ్యక్షతన జగ్గంపేట నియోజకవర్గంలోని 15 గ్రామాలకు చెందిన సగర కులస్తులతో శనివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. చలమశెట్టి సునీల్, తోట నరసింహం, తోట రాంజీ, సగర సంఘం జిల్లా అధ్యక్షుడు నక్కా కిషోర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ కాకినాడ పార్లమెంట్ పరిధిలోని సగర కులస్తులకు అన్ని మండల్లాలోనూ కమ్యూనిటీ భవనాలు కట్టించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజల నుంచి సీఎం జగన్‌ను దూరం చేసేందుకు ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. టీడీపీ ఆచరణ సాధ్యంకాని హామీలను మేనిఫెస్టోను పెట్టిందని, ఆ హామీలు, మేనిఫెస్టోను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పార్లమెంట్ పరిధిలో 400 గ్రామాలను దత్తత తీసుకుని ఒక్కో గ్రామాన్ని రూ.కోటితో అభివృద్ధి చేస్తామన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం మాట్లాడుతూ సగర కుల సంఘం పెద్దలను ఆత్మీయ సమావేశంలో కలవడం ఆనందంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో పూర్తి మద్దతు ఇచ్చి జగ్గంపేట ఎమ్మెల్యే తనను, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోన్‌రెడ్డి బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అన్ని కులాలకు సమన్యాయం చేసిన సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని సగర సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ ఎపీపీ నక్కా శ్రీను, సర్పంచ్ పోట్రు వీర్రాజు, ఎంపీటీసీ నంగన నానీ, జె.శ్యామ్, గంటికోట అప్పన్న, నక్కా అబ్బు, గనికొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

6న పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు

శంఖవరం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆదివారం నిర్వహించాల్సిన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు ఈ నెల 6కు వాయిదా వేసినట్లు మండల ఎన్నికల అధికారి ఎస్వీ రమణ తెలిపారు. ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు సోమవారం మాత్రమే వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్‌కు ఏర్పాట్లు

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్‌కు ఏర్పాట్లు చేసినట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల సిబ్బందికి ఉద్యోగులు ఈ నెల 5, 6 తేదీల్లో జగ్గంపేట డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన ఫెసిలేషన్ సెంటర్‌లో తమఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. జగ్గంపేట, గండేపల్లి మండలాలకు చెందిన ఉద్యోగులు 5న, గోకవరం, కిర్లంపూడి మండలాలకు చెందిన వారు 6న పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు.

200 మందికి వైద్య పరీక్షలు

తుని: స్థానిక గణపతినగర్ పార్కులో సిటీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్ట క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు సోమేశ్వరరావు తెలిపారు. శనివారం పార్కు ఆవరణలో రోగులకు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అలాగే ఆయుర్వేద గుణాలు కలిగిన తమల పాకు, తేనే, వెల్లుల్లి, అల్లంతో తయారు చేసిన కిళ్లీలను వాకర్స్‌కు ఉచితంగా అందజేశారు. వాకర్స్ హెల్త్ క్లబ్ కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షుడు లోకారెడ్డి అప్పారావు, సహాయ కార్యదర్శి వెంకటేష్, కె.భీమరాజు, ఆర్ఎస్ఎన్.మూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

ఏలేశ్వరం: ప్రత్తిపాడు మండలం వాకపల్లి గ్రామానికి చెందిన 15 కుటుంబాలు శనివారం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. ఏలేశ్వరం మండలం లింగంపర్తిలోని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి వరుపుల పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కోడిబోయిన సత్యనారాయణ, కురందాసు



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న యనమల కృష్ణుడు

అచ్చారావు, అవ్వా నాగసత్యనారాయణ, ఇసరపు శ్రీను, కోన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

తుని: తొండంగి మండలం ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు శనివారం వైఎస్సార్



లింగంపర్తిలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న వరుపుల సుబ్బారావు

సీపీలో చేరాయి. ఎ.కొత్తపల్లి టీడీపీ నాయకులు బస్వా లక్ష్మణరావు, శెట్టిబల్లి శ్రీను, గర్లంక రమణతో పాటు 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరికి వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో దాడిశెట్టి రాజా విజయానికి శక్తివంచన లేకుండా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు రాంజీ
- కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం

గోకవరం: గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపిస్తాయని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో శనివారం రెండో రోజు ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, కొత్త మేనిఫెస్టోను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తన తండ్రి తోట నరసింహాన్ని ఎమ్మెల్యేగా, చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

150 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

కొత్తపల్లిలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. ఎస్సీపేటకు చెందిన సుమారు 150 కుటుంబాలు టీడీపీని వీడి తోట రాంజీ సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరాయి. స్థానిక నేత కడిమి సంకురయ్య ఆధ్వర్యంలో వీరంతా పార్టీలోకి చేరగా రాంజీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గోకవరం సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, పార్టీ నాయకులు సుంకర వీరబాబు, సమ్మెటి నాని, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ వుయ్యూరి నాని, నున్నం రాంబాబు, బొప్పన సత్యనారాయణ, దిండి ప్రభాకరరావు, దిండి వీరవెంకట్రావు, గొన్నే వెంకటేశులు, కూరాకుల సుమంగళి, కొల్లం సంపత్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న తోట రాంజీ